

త్రయంబకేశ్వర్ ఆలయంలో హోమం చేస్తున్న దృశ్యం

హరోం హర!

• మార్మోగిన శివనామస్మరణ • శివాలయాలకు పోటెత్తిన భక్తజనం



భక్త మార్కండేయ స్వామి ఆలయం వద్ద భక్తజన సందడి

ఆదోనిటౌన్, ఆదోని రూరల్ : ఊరూరా శివనామస్మరణ మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. పరమశివుడిని దర్శించుకుని పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, హోమాలు తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆదోని పట్టణంలోని శంభులింగేశ్వరస్వామి, వాల్మీకినగర్‌లోని గోరఖ్‌నాథ్ మఠంలోని త్రయంబకేశ్వర్ మహామృత్యుంజయ మంజునాథస్వామి, శ్రీశాంతమల్లప్ప కొండలో శాంత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలో ఈశ్వరుని ప్రతిమతో ఊరేగింపు నిర్వహించారు. శివుడి జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేస్తూ ముందుకు కదిలారు. అలాగే మండల పరిధిలోని పెద్దహరివాణం, పెద్దతుంబళం, సంతెకూడ్లూరు, చిన్నహరివాణం, మండిగిరి, దొడ్డనగేరి, పెసలబండ, ఢణాపురం, నాగనాథనహళ్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తజన సందడి కనిపించింది.

కౌతాళం: మేళిగనూరు గ్రామం వద్ద తుంభద్రనది తీరాన వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ కొనసాగింది.తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని ఎరిగేరిలోని పులిగొట్టు అంజనేయస్వామి దేవాలయం, బసవేశ్వర స్వామి ఆలయం, బదినేహాల్ మల్లికార్జునస్వామి ఆలయం, రౌడూరు జట్టెప్పతాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. కౌతాళంలో త్రిలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు బారులు తీరారు. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కోసిగి: మండలంలోని మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోసిగిలోని ఈశ్వర దేవాలయం, మార్కండేయ స్వామి, బీరప్ప స్వామి, వీరభద్రేశ్వర స్వామి, నూగూరప్ప, శంకర లింగేశ్వర స్వామి ఆలయాల్లో శివలింగాలకు జలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతులు గావించి విశేష పూజలు చేశారు. అలాగే దుద్ది, కందుకూరు గ్రామాల్లో రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో శివనామస్మరణ మార్మోగింది.



ఆదోని..పూజలందుకున్న పార్వతీ పరమేశ్వరుడి విగ్రహాలు



ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రనేత్రుడికి మహా రుద్రాభిషేకం



రామలింగేశ్వరస్వామి పూజల్లో ప్రదీప్‌రెడ్డి



రామలింగేశ్వరస్వామి

మంత్రాలయం/మంత్రాలయం రూరల్ : ప్రముఖ శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో మహా శివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. రాఘవేంద్రుల మూలబృందావనం అభిముఖంగా వెలసిన రుద్ర దేవుడికి పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శివలింగానికి నిర్మాల్య విసర్జన, జల, క్షీరం, తైలం, సుగంధ ద్రవ్యాలు, పంచామృతం రుద్రాభిషేకాలు చేశారు. పండితులు, సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు వేద మంత్రోచ్ఛారణలు మధ్య శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మహామంగళ హారతులతో శివ పూజలకు ముగింపు పలికారు. అనంతరం పీఠాధిపతి భక్తులకు ఫల, పూల మంత్రాక్షింతలు అందజేశారు.

• మండల కేంద్రం పాతవూరులో వెలసిన శ్రీ రామలింగేశ్వరస్వామికి , రాఘవేంద్రనగర్‌లో కొలువుదీరిని మల్లికార్జునస్వామికి తెల్లవారుజామునుంచి ఫల, పుష్ప, క్షీరా, పంచామృతాభిషేకాలు చేపట్టి అనంతరం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేక రథంలో కొలువుంచి అశేష భక్త జనవాహిని మధ్య ఉరేగించారు. రాంపురం గ్రామంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామికి వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మాధవరం గ్రామ సమీపంలోని తుంగభద్ర నది తీరంలో కొలువుదీరిన శివ లింగానికి గ్రామస్తులు అభిషేకాలు అలంకరణ చేపట్టారు. శివరాత్రి వేడుకల సందర్భంగా ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.



చాక్‌పీస్‌పై పరమ శివుడు

ఆదోని రూరల్: కమ్మరచేడు జెడ్పీ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న మల్లికార్జున చాక్‌పీసుపై శ్రీశైలాలయ గోపురం, పరమశివుడి ప్రతిమ వేసి అబ్బురపరిచాడు. మహాశివరాత్రి పురస్కరించుకుని గీసిన ఈ చిత్రాన్ని తోటి ఉపాధ్యాయులు చూసి ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు

ఆదోని టౌన్ : స్థానికంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ చౌకబారు విమర్శలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ముస్లిం, మైనార్టీ మహిళా నాయకురాళ్లు జిలేకాబీ, ఆదోని నియోజకవర్గ మహిళా సెల్ ఇన్‌చార్జ్ శ్రీలక్ష్మి మాట్లాడారు. ఆదోనిలో అభివృద్ధి అంటూ ఏదీ లేదని క్రిష్ణమ్మ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ పాలనలో ఆదోనిలో ఏమి అభివృద్ధి పనులు చేపట్టారో చూపాలన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో ఆదోని పట్టణంలోని మిల్లులన్నీ మూతపడిన విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా తమ నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోపాల్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, మహిళా నాయకురాళ్లు లక్ష్మి, శ్రీదేవి, శోభాలత, సుగుణమ్మ, సుజాత పాల్గొన్నారు.

వైపీ రావు మృతి కార్మికులకు తీరనిలోటు

ఆదోనిటౌన్ : ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ అమరావతి జేఏసీ మాజీ జనరల్ సెక్రటరీ వైపీ రావు మృతి కార్మిక వర్గానికి, ఉద్యోగులకు తీరని లోటని ఆదోని ప్రజారోడ్డు సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రంగస్వామి, ఎస్‌వీ కుమార్, లక్ష్మన్న అన్నారు. శనివారం స్థానిక డిపో గ్యారేజీలో సంతాప సభ నిర్వహించి వైపీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఉలిగప్ప, గ్యారేజీ కార్యదర్శి మేసే రాజు, నాయకులు శంకర్, శేఖర్, గౌడ్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు: కల్లూరులోని శ్రీనివాస నగర్ వద్ద ఈ నెల 13వ తేదీ రాత్రి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమారుడు శివనరసింహారెడ్డి పీఏ కొమ్ము గిరిప్రసాద్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను నాల్గవ పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. శరీన్‌నగర్‌కు చెందిన ఎరుకలి నల్లబోతుల వంశీ అలియాస్ వంశీకృష్ణ, కల్లూరులోని సుంకులమ్మ గుడి దగ్గర ఉన్న శీల పోగు విశ్వనాథ్ అలియాస్ బన్నీ, సి.క్యాంప్‌లోని సత్యనారాయణ నగర్‌లో నివాసముంటున్న ఎరుకలి శివ అలియాస్ శివలు కలసి గిరిప్రసాద్‌పై శ్రీనివాసనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద కత్తితో దాడి చేసి పరారయ్యారు. సెక్షన్ 307 రెడ్‌విత్ 340 ఐపీసీ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్‌ఐ రామయ్య ఆధ్వర్యంలో శనివారం ఉదయం కల్లూరు మండలం ఉల్చాల రోడ్డు సమీపంలోని ఎల్కూరు ఎస్టేట్ వద్ద ముద్దాయిలను దాడిచేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఏపీ21 సీఎఫ్ 2999 రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్, రక్తం మరకలు కలిగిన దుస్తులు, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పర్‌భద్రతో తీవ్ర నష్టం

కౌతాళం: తుంగభద్ర డ్యాం పైభాగంలో కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఈప్రాంతం ఏడారిగా మారుతుందని రాయలసీమ కో-ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ఎల్‌ఎల్‌సీ నీటి ఆయకట్టు దారుల సంఘం నాయకుడు సాయిబాబా, రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకుడు ఉమ్మి సలీం అన్నారు. ఇప్పటికైనా అందరం మేల్కొని తుంగభద్ర నికర జలాల పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. శనివారం కౌతాళంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తుంగభద్ర రాయలసీమకు జీవధార అని ఆ నదిపైనే ఆధారపడి ఎల్‌ఎల్‌సీ, హెచ్‌ఎల్‌సీ, ఆర్‌డీఎస్, కేసీ కాలువలు ఉన్నాయన్నారు. అప్పర్‌భద్ర నిర్మాణం వల్ల ఈ కాలువలన్నీ ఎత్తిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు రాఘవేంద్ర, అనిల్, బసవరాజు, టిప్పు సుల్తాన్, షేక్షావలి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నేడు శివాజీ విగ్రహ ప్రతిష్ట

కోసిగి: మండల కేంద్రం కోసిగి రైల్వే గేటు సమీపంలో సిద్ధరూఢ ఆశ్రమంలో ఆదివారం ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠించనున్నట్లు శివాజీ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు గ్రామంలో వ్యాపారులు, ప్రజలను కలిసి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. నేటి మధ్యాహ్నం 3గంటలకు గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

తిమ్మగురుడు ఉత్సవాలు ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని మీటే తండా సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన తిమ్మ గురుడు, పక్కీరప్పస్వాముల తిరునాల ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలతో రాత్రంతా జాగరణ చేశారు. తిరునాల సందర్భంగా అప్పా సోదరులు అన్నదానం చేశారు.

మానవత్వంతో మెలగాలి

కౌతాళం: సమాజంలో ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలగాలని మౌలాన మహమ్మద్ అక్బర్ అన్నారు. షబ్-ఎ-మేరాజ్ సందర్భంగా శనివారం ప్రత్యేక నమాజ్ ఆచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమాజు అనేది ప్రతి ఒక్క ముస్లిం తప్పనిసరిగా ఆచారించాల్సిన నియమం అన్నారు. అనంతరం షబ్-ఎ-మేరాజ్ రాత్రి యొక్క విశిష్టతను మౌలాన వివరించారు. కౌతాళంలోని ఐదు మసీదులతో పాటు కుంటనహాల్, హాల్వి, కామవరం, గుడికంబాలి, చూడి, చిరుతపల్లి, ఉప్పరహాల్,బదినేహాల్,నదిచాగి,ఎరిగేరిల్లో బడేరాత్‌ను ఘనంగా జరుపుకున్నారు.